క్లుప్తంగా

చెక్కు అందజేత

పాలకుర్తి: మండలం దర్దేపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు గిరగాని యాకయ్య ప్రమాద వశాత్తు మృతి చెందాడు. కాగా పార్టీ సభ్యత్వం ద్వారా వచ్చిన రూ. 2లక్షల చెక్కును బుధవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బాధిత కుటుంబానికి అందజేశారు. ఇమ్మడి ప్రకాశ్, సమ్మయ్య ఉన్నారు.

పరామర్శ

దేవరుప్పుల: మండలంలోని కామారెడ్డి గూడేనికి చెందిన కారుపోతుల యాదమ్మ మృతి చెందింది. కాగా, బుధవారం ఆమె మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు పూలమాల వేసి ఆ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ధర్మారెడ్డి, పరశురాములు, రెడ్డిరాజుల రమేష్, ఓడపల్లి రవీందర్ తదితరులు ఉన్నారు.

వైకుంఠరథం వితరణ

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం గ్రామ వాస్తవ్యుడు, హనుమకొండ మాజీ ఎమ్మెల్యే మందాడి సత్యనారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శ్యాంప్రసాద్‌రెడ్డి గ్రామానికి వైకుంఠరథం బుధవారం అందించారు. అనంతరం గ్రామస్తుల ఆధ్వర్యంలో శ్యాంప్రసాద్‌రెడ్డిని సన్మానించారు.

కరాటే విద్యార్థులకు బెల్ట్‌లు, సర్టిఫికెట్ల ప్రదానం

జఫర్‌గఢ్: రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన బెల్ట్ టెస్ట్ టోర్నీలో పాల్గొన్న మండలంలోని తమ్మడపల్లి (జి) గ్రామానికి చెందిన విద్యార్థులకు ఫౌండర్ రవి బెల్ట్‌లు, సర్టిఫికెట్లను బుధవారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులు తమ సమయాన్ని వృథా చేయకుండా కరాటేలో ప్రత్యేక శిక్షణ పొందాలన్నారు. మాస్టర్ అన్నెపు రాజేంద్రం, నారాయణ పాల్గొన్నారు.

24 నుంచి బీరప్ప కల్యాణం

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లి గ్రామంలో కురుమ కులస్తుల ఆరాధ్యదైవమైన బీరప్పస్వామి దేవాలయంలో ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకు బీరప్పస్వామి, కామరాతి కల్యాణ మహోత్సవాలను అంగరంగవైభవంగా నిర్వహించనున్నారు. బీరప్పస్వామి కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని దేవాలయ కమిటీ అధ్యక్షుడు మేకల మల్లేశం, కురుమ కులపెద్దలు, కుల సంఘంవారి ఆధ్వర్యంలో స్వామివారి గుడిని అన్ని హంగులతో అలంకరిస్తున్నారు. స్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఈనెల 26న ప్రధాన ఘట్టమైన బీరప్ప, కామరాతి కల్యాణాన్ని నిర్వహిస్తామని అధ్యక్షుడు మేకల మల్లేశం తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొడకండ్ల: మండలకేంద్రంలోని తెలంగాణ గురుకుల పాఠశాల, కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఆంగ్ల మాధ్యమంలో బోధించేందుకు తగిన విద్యార్హత, అనుభవం కలిగిన వారు అతిథి ఉపాధ్యాయ, లెక్చరర్ పోస్టుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్‌కుమార్ కోరారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 30 వరకు దరఖాస్తులు పాఠశాలలో అందించాలని, దరఖాస్తు చేసుకొన్న వారు డెమో క్లాసులకు హాజరు కావాల్సి ఉంటుందని, వివరాల కోసం 9866559710 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

విచారణ చేపట్టాలి

చిల్పూరు: భార్య పేర ఉన్న భూమిని భర్తకు తెలియకుండా అక్రమంగా వేరొకరికి పట్టా చేసిన తహసీల్దార్ సరస్వతిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి బాధితుడికి న్యాయం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి సాదం రమేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంగళవారం బాధితుడు రాజ్‌కుమార్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేయగా రెండు రోజుల్లో పట్టా రద్దు చేస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చిందని, శుక్రవారం వరకు పట్టా రద్దు చేయకుంటే బాధితుడి పక్షాన ఆందోళన చేస్తామన్నారు.

ఇసుక తరలింపును అడ్డుకున్న రైతులు



దేవరుప్పుల: మొన్నటి వరకూ అభివృద్ధి నిర్మాణ పనుల పేరిట అక్రమంగా ఇసుక రవాణా కొనసాగిన వాగు పరివాహక ప్రాంతాల్లో ఏకంగా రిజర్వాయర్ల నిర్మాణం కోసం ప్రభుత్వం అనుమతి పేరిట గొల్లపల్లి ఇసుక తరలింపునకు శ్రీకారం చుట్టగా బుధవారం రైతులు అడ్డుకున్నారు. గొల్లపల్లి శివారులో పాలకుర్తి రిజర్వాయర్ కోసమని ఇసుక తరలించేందుకు ఇటాచ్ యంత్రాలు, ట్రాక్టర్లు వాగులోకి దిగాయి. విషయం తెలువగానే పీఏసీఎస్ దేవరుప్పుల మాజీ చైర్మన్ కాసారపు ధర్మారెడ్డి ఆధ్వర్యంలో రైతులు చేరుకొని ఇక్కడి ఇసుక తరలిస్తే భూగర్భజలాలు అటుగంటుతాయని నిలువరించడంతో తాత్కాలికంగా ఇసుక తీయడాన్ని ఆపేశారు. అభివృద్ధి పేరిట తీసుకెళ్తే మండల ప్రజల జీవనవిధానానికి తీవ్ర విఘాతం కలుగుతుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డబుల్ రోడ్డుకు మోక్షమెప్పుడో?

- పదేళ్లుగా నోచుకోని పరిస్థితి
- ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు



తాటికొండలో అధ్వానంగా ఉన్న బీటీ రోడ్డు



గుంతలుపడిన కొత్తపల్లిలో రోడ్డు

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి కొత్తపల్లి, తాటికొండ, మల్లన్నగండికి వెళ్లే రోడ్డు ఏళ్ల తరబడి విస్తరణకు నోచుకోవడం లేదు. అసలే సింగిల్ రోడ్డు, దానికి తోడు రోడ్డుపై గుంతలతో ఈ దారి వెంట వివిధ వాహనాలపై వెళ్లేవారు నరకయాతన అనుభవిస్తున్నారు. ఘన్‌పూర్ శివారు కొత్తపల్లి క్రాస్‌రోడ్డు నుంచి తాటికొండ మీదుగా మల్లన్నగండి వరకు రోడ్డు విస్తరణ చేసి డబుల్ రోడ్డు వేస్తామని పాలకులు చేసిన హామీలు పదేళ్లయినా నోచుకోకపోవడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. వివరాలు ఇలా ఉన్నాయి. స్టేషన్ ఘన్‌పూర్ నుంచి కొత్తపల్లి, తాటికొండ తదితర గ్రామాలకు ఏళ్ల తరబడి సింగిల్‌రోడ్డు ఉంది. ఈ రోడ్డు గుండా అనునిత్యం ఆర్టీసీ బస్సులు, ఆటోలు, డీసీఎం వ్యాన్‌లు, కార్లు, బైక్‌లు తదితర వాహనాల ద్వారా ప్రజలు వెళ్తుంటారు. దానికి తోడు జాతీయ రహదారి నిర్మాణ సమయంలో తాటికొండ నుంచి టిప్పర్ లారీలతో మొరం తరలించడంతో రోడ్డు ధ్వంసమైంది. అదేవిధంగా వర్షాలతో రోడ్డు పలుచోట్ల ధ్వంసమై గుంతలుగా మారింది. ఘన్‌పూర్ నుంచి తాటికొండకు వెళ్లే ప్రయాణికులకు ప్రతీరోజూ గుంతల రోడ్డుపై సర్కస్ ఫీట్లు తప్పడం లేదు.

రెండు మండలాల ప్రజలకు అనుకూలం

ఘన్‌పూర్ శివారు కొత్తపల్లి క్రాస్‌రోడ్డు నుంచి తాటికొండ, జిట్టెగూడెం, మల్లన్నగండి రిజర్వాయర్ మీదుగా నర్మెట వరకు డబుల్‌రోడ్డు వేస్తే స్టేషన్‌ఘన్‌పూర్, నర్మెట రెండు మండలాల ప్రజలకు అనుకూలంగా ఉంటుంది. కొత్తపల్లి క్రాస్‌రోడ్డు నుంచి దేవాదుల రిజర్వాయర్ కట్టమీదుగా కొత్తపల్లి, తాటికొండ, జిట్టెగూడెం, నర్మెట వరకు దాదాపు 30 కిలోమీటర్ల మేర సింగిల్ రోడ్డు ఉంది. సింగిల్‌రోడ్డు ప్రయాణం ప్రమాదకరంగా మారగా అనునిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎదురెదురుగా రెండు పెద్ద వాహనాలు వస్తే ఇబ్బందికరంగా ఉంది. ప్రస్తుతం స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, వర్ధన్నపేట తదితర ప్రాంతాలకు చెందిన వారు నర్మెటకు వెళ్లాలంటే జనగామ మీదుగా గాని, చిల్పూరు మండలం చిన్నపెండ్యాల మీదుగాగాని వెళ్తున్నారు. తాటికొండకు డబుల్‌రోడ్డు వేస్తే నర్మెటకు వెళ్లేందుకు ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. దూరం తగ్గడంతో పాటు సమయం ఆదా అవుతుంది.

పర్యాటకులకు ప్రయోజనం

మల్లన్నగండి రిజర్వాయర్ అందాలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులకు తరలివస్తున్నారు. ప్రధానంగా వారాంతపు శని, ఆదివారం, సెలవు రోజుల్లో మల్లన్నగండి రిజర్వాయర్‌కు యువకులు ఆటవిడుపుగా వస్తున్నారు. హనుమకొండ, జనగామ తదితర ప్రాంతాల నుంచి వస్తుండటంతో పర్యాటకుల రద్దీ పెరిగింది. కొత్తపల్లి క్రాస్ నుంచి నర్మెట వరకు 30 కి.మీ రోడ్డు డబుల్ రోడ్డు చేస్తే పర్యాటకులకు ఎంతో అనువుగా ఉంటుంది. అదేవిధంగా ప్రతీ రెండు సంవత్సరాలకు ఒక్కసారి జిట్టెగూడెం సమ్మక్క–సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది.

అమలుకు నోచుకోని హామీలు

కొత్తపల్లి క్రాస్ నుంచి నర్మెట వరకు రోడ్డు విస్తరణ విషయమై ప్రతీ ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీల నేతలు హామీలు చేస్తున్నారే గాని ఇంతవరకూ అమలుకు నోచుకోవడం లేదు. ప్రతీసారి ఇదిగో, అదిగో అంటూ పాలకులు కాలయాపన చేస్తున్నారు. తాటికొండ డబుల్‌రోడ్డు అంశం తెరపైకి వచ్చి పదేళ్లు కావస్తున్నా ఇంతవరకూ మోక్షం లభించడం లేదు. పాలకులు, అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో పదేళ్లుగా ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఈ విషయమై ప్రత్యేక చొరవ చూపి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు వేస్తే అనువుగా ఉంటుంది



ఘన్‌పూర్ శివారు కొత్తపల్లి క్రాస్ రోడ్డు నుంచి తాటికొండ వరకు డబుల్‌రోడ్డు వేస్తే అందరికీ అనువుగా ఉంటుంది. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాను. సింగిల్‌రోడ్డు, గుంతలమయంగా ఉండటంతో ఇబ్బందికరంగా ఉంది. ఎదురుగా పెద్ద వాహనాలు వస్తే కష్టమవుతుంది. డబుల్ రోడ్డు వేస్తే ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది.

– ఎన్.రామాంజనేయులు, ఆటోడ్రైవర్

రోడ్డు సమస్యను పరిష్కరించాలి



గత పదేళ్లుగా ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న తాటికొండ రోడ్డు సమస్యను పరిష్కరించాలి. సింగిల్ రోడ్డుతో కొత్తపల్లి, తాటికొండ, జిట్టెగూడెం తదితర గ్రామాల ప్రజలకు ఎంతో ఇబ్బందికరంగా ఉంది. గత పాలకులు రోడ్డు సమస్యను పట్టించుకోలేదు. ప్రస్తుత పాలకులు ఈ రోడ్డుపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరిస్తే ప్రజలు ఎంతో సంతోషిస్తారు.

– వక్కల రాజు, తాటికొండ

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ



రఘునాథపల్లి: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ –1 కేంద్రాన్ని ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కేంద్రానికి వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతల సంఖ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. పౌష్టికాహారం స్టాక్ పంపిణీ రిజిస్టర్‌ను ఆయన పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో సమయ పాలన పాటించడంతో పాటు చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య, బొమ్మలు, వివిధ ధాకృతులతో అవగాహన కల్పించి సృజనాత్మకతను వెలికి తీయాలని అంగన్‌వాడీ కార్యకర్త తాళ్లపెల్లి అరుణకు ఎంపీడీఓ సూచించారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి



బచ్చన్నపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లోని రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి బుధవారం అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీలో భాగంగా వారు రికార్డులను తనిఖీ చేశారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనృసింహస్వామి కల్యాణం

లింగాలఘణపురం: మండలంలోని బండ్లగూడెం బండగుట్ట లక్ష్మీనృసింహస్వామి కల్యాణం బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం మండల కేంద్రంలోని లింగాల దీపక్‌రెడ్డి ఇంటి నుంచి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. అదేవిధంగా మండల కేంద్రంలోని పద్మశాలీలు ట్రాక్టర్‌పై మగ్గం ఏర్పాటు చేసి స్వామి ఊరేగింపులోనే నూతన పట్టు వస్త్రాలను నేసి లక్ష్మీనృసింహస్వామికి సమర్పించారు. అనంతరం ఆలయం వద్ద కల్యాణ మండపంపై అర్చకులు కృష్ణమాచార్యుల వేద మంత్రోచ్చారణలతో పుణ్యదంపతులు పెళ్లి పెద్దలుగా వ్యవహరించగా లక్ష్మీనృసింహస్వామి కల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వంచ మహేశ్వర్‌రెడ్డి, లింగాల దీపక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కుమారస్వామి, ఎంపీటీసీ భిక్షపతి, చిర్ర మధుసూదన్‌రెడ్డి, వంచ రాంరెడ్డి తదితరులు భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు. పద్మశాలీలు వంగ ఉప్పలయ్య, బింగి స్వామి, బాల్దె సత్యనారాయణ, బిట్ల ఉప్పలయ్య, మహేశ్వరం చిరంజీవి తదితరులంతా ట్రాక్టర్‌పై పట్టు వస్త్రాన్ని నేశారు.

జఫర్‌గఢ్‌లో జయంతి ఉత్సవాలు

జఫర్‌గఢ్: మండల కేంద్రంలో పడమర కొండపై వెలసిన లక్ష్మీనృసింహస్వామి జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకుల మంత్రోచ్చరణల మధ్య పూజలు నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే జయంతి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఆలయంలో 81 కలశాలతో స్వామి వారి అభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు వెంకటాచార్యులు, కృష్ణమాచార్యులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



లింగాలఘణపురం: కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు, పాల్గొన్న భక్తులు

ముగిసిన బ్రహ్మోత్సవాలు

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండ గుట్టపై లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఐదురోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ముగిసాయి. ఆలయ నిర్వాహకులు, పీఏసీఎస్ చైర్మన్ గంగిడి నర్సింహారెడ్డి–పద్మ దంపతుల ఆధ్వర్యంలో వేద పండితులు కృష్ణమాచార్యులు మంత్రోచ్చారణాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎలపాటి గోపాల్‌రెడ్డి, కర్ల జయపాల్‌రెడ్డి, పర్రెడ్డి మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు వేణుగోపాలస్వామి కల్యాణం

మండలంలోని గోవర్ధనగిరి వేణుగోపాలస్వామి గుట్టపై గురువారం వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. బుధవారం ఆలయ కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ మధ్యాహ్నం 12.30 గంటలకు వేద పండితుల మంత్రోచ్చారణాలతో అంగరంగ వైభవంగా కల్యాణం నిర్వహిస్తామన్నారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరు కాగలరని వారు కోరారు.

సంక్షిప్త సమాచారం

హనుమాన్ మాలధారులకు అన్నదానం



బచ్చన్నపేట: మండలంలోని చిన్నరామన్‌చర్ల గ్రామంలో హనుమాన్ మాలాధారులకు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు పిన్నింటి కావ్యశ్రీ, మాజీ సర్పంచ్ పిన్నింటి బాపురెడ్డి దంపతులు బుధవారం అన్నదానం నిర్వహించారు.

చిల్పూరు: మండలంలోని శ్రీపతిపల్లి గ్రామంలో బుధవారం గ్రామానికి చెందిన మాలోత్ రాజు–శ్రవంతి దంపతులు హనుమాన్ మాలధారులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా హనుమాన్ భక్తులతో కలిసి మహా పడి పూజ నిర్వహించారు. హరీష్, రంగు రమేష్, నరేష్, బాలకృష్ణ, మహేష్ పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

జనగామ రూరల్: ఈనెల 30, 31 తేదీల్లో జఫర్‌గఢ్ మండల కేంద్రంలో నిర్వహించే సీపీఐ శిక్షణా తరగతులు విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జువారి రమేశ్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

లారీ బోల్తా

బచ్చన్నపేట: జనగామ–సిద్దిపేట రహదారిపై మండల కేంద్రంలోని కొడవటూర్ కమాన్ సమీపంలో దాణాతో వెళ్తున్న లారీ బోల్తా పడిన ఘటన బుధవారం జరిగింది. గ్రామస్తుల తెలిపిన వివరాల ప్రకారం.. ఛేగుంట నుంచి మహబూబాబాద్ వెళ్తున్న లారీ చేర్యాల రోడ్ మీదుగా బచ్చన్నపేట వైపు వస్తోంది. గుడి చెరువు దాటిన తర్వాత లారీ బోల్తా పడగా డ్రైవర్‌కు గాయాలయ్యాయి. కాగా, అసంపూర్తిగా రోడ్డు పనులు ఉండటంతోనే ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వెంటనే పనులు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

అంబులెన్స్ ఢీకొని పాడిగేదె మృతి

దేవరుప్పుల: జనగామ–సూర్యాపేట రహదారిలో ప్రమాదవశాత్తు పాడిగేదె మృతి చెందిన విషయమై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్ చెన్నకేశవులు తెలిపారు. మంగళవారం రాత్రి మండలంలోని కామారెడ్డిగూడేనికి చెందిన బిల్లా రామిరెడ్డి పాడిగేదె ఎంఎన్‌ఆర్ గార్డెన్ ఏరియాలో రోడ్డు దాటుతుండగా కొడకండ్లలో పార్థీవదేహాన్ని దింపి సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తిరిగి వెళ్తున్న ఉచిత అంబులెన్స్ ఢీకొనడంతో గేదె అక్కడికక్కడే మృత్యువాత పడింది. ఈ విషయమై బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

విద్యుదాఘాతంతో ఎద్దు..

జఫర్‌గఢ్: వ్యవసాయ బావి వద్ద మేత మేస్తున్న క్రమంలో విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని కూనూర్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధిత రైతు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు పల్లె శ్రీనివాస్‌రెడ్డి ఎద్దు రోజుమాదిరిగా వ్యవసాయ బావి వద్ద మేత మెస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న ఎస్ఎస్ 62 ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ వైర్ తగిలి మృతి చెందింది. సుమారు రూ.80 వేల విలువ చేసే ఎద్దు మృతి చెందడంతో బాధిత రైతు తీవ్రంగా నష్టపోయాడని ప్రభుత్వ పరంగా ఆర్థిసాయం అందించి బాధితుడిని ఆదుకోవాలని పలువురు కోరారు.

‘బ్లాక్‌మెయిలర్‌కు పట్టభద్రులు బుద్ధి చెప్పాలి’

కొడకండ్ల/పాలకుర్తి టౌన్: విద్యావంతుడు, బ్లాక్‌మెయిలర్‌కు జరుగుతున్న ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో పట్టభద్రులంతా విజ్ఞతతో ఆలోచించి బ్లాక్‌మెయిలర్‌కు తగిన బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరారు. బుధవారం కొడకండ్ల, పాలకుర్తి మండలకేంద్రంలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టభద్రులంతా ఆలోచించి విద్యావంతుడు, ప్రజా సమస్యలపై ప్రశ్నించే తత్వం కలిగిన రాకేశ్‌రెడ్డికి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి శాసనమండలికి పంపాలని అన్నారు. ఎన్నికల ఇన్‌చార్జ్ చల్మెడ లక్ష్మీనర్సింహరావు, మార్కెట్ చైర్మన్ రాము, జెడ్పీ ఫ్లోర్‌లీడర్ శ్రీనివాసరావు, ఎంపీపీలు జ్యోతి, నల్ల నాగిరెడ్డి, సిందె రామోజీ, పసునూరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తరఫున ప్రచారం

జనగామ: ఎమ్మెల్సీ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగు రాకేశ్‌రెడ్డి గెలుపు కోరుతూ పట్టణంలోని 20వ వార్డులో కౌన్సిలర్ జూకంటి లక్ష్మీ శ్రీశైలం ఆధ్వర్యంలో ఆ పార్టీ ఇన్‌చార్జ్ సిరిసిల్ల ఫ్యాక్స్ వైస్ చైర్మన్ ఎగుమామిడి రామాగౌడ్ బుధవారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. వార్డు అధ్యక్షుడు దామెర రాజు, మండల జాగృతి అధ్యక్షుడు కందుకూరి రామాగౌడ్, జాయ శ్రీశైలం, శ్రీనివాస్, పసుల ఏబేల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవొద్దు..

తరిగొప్పుల: కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవొద్దని, ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని గెలిపించాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పింగిళి జగన్‌మోహన్ రెడ్డి కోరారు. ఉప ఎన్నిక నేపథ్యంలో బుధవారం మండలకేంద్రంలో ప్రచారం నిర్వహించారు. గ్రామ శాఖ అధ్యక్షుడు అంకం రాజారాం, చెన్నూరి సంజీవ, వంగ రామరాజు, బూస యాదగిరి, అంకం శ్రీనివాస్, నేతుల సత్తయ్య పాల్గొన్నారు.



కొడకండ్ల: మాట్లాడుతున్న దయాకర్‌రావు

ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించండి

నర్మెట: వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పార్టీ రాష్ట్రనాయకుడు గద్దల నర్సింగారావు, ఉమ్మడి మండలాల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి కోరారు. మండలకేంద్రంతో పాటు పలుగ్రామాల్లో బుధవారం పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారం నిర్వహించారు. మండల శాఖ అధ్యక్షుడు చింతకింది సురేష్, జెడ్పీ కోఆప్షన్ ఎండీ గౌస్, జాల కిషన్, బావండ్లపల్లి రాజు, బొడికె వినోద్, గద్దల విజయ్‌కుమార్, బొడికె వెంకన్న, గద్దల కిరణ్‌కుమార్, బెల్లి కనకయ్య, బొడికె సంపత్, జినుక రవీందర్, గద్దల భాస్కర్ పాల్గొన్నారు.

తీన్మార్ కాదు.. తారుమారు మల్లన్న

చిల్పూరు/జఫర్‌గఢ్: ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో పోటీలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లన్న తీన్మార్ కాదని.. తారుమారు మల్లన్న అని.. ఇది మేథావులు గుర్తించాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం కో ఆర్డినేటర్ సుంకె రవిశంకర్, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యలు అన్నారు. చిల్పూరు, జఫర్‌గఢ్ మండలాల్లో బుధవారం నిర్వహించిన ఇన్‌చార్జ్‌ల సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలుపునకు కృషి చేయాలన్నారు. ఎడవెళ్లి కృష్ణారెడ్డి, కేశిరెడ్డి రాకేశ్‌రెడ్డి ఉద్దెమారి రాజ్‌కుమార్, మాలోత్ రమేష్, లొడెం రవీందర్, నారగోని రవిచంద్ర, ఎడ్ల మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.



నర్మెట: ప్రచారం చేస్తున్న నాయకులు

రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఇవ్వండి

దేవరుప్పుల: ప్రజాసమస్యల పరిష్కారంపై పాలకవర్గాలపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రతిపక్షపార్టీలకే సాధ్యమైనందున.. ఎమ్మెల్సీ ఎన్నికలో బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్‌రామిరెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు దయాకర్, రవి, మాజీ ఎంపీపీ సోమన్న, విజయ్, నర్సింహ్ములు, రవీందర్, సోమన్న, నగేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్నను గెలిపించాలి

కొడకండ్ల/ బచ్చన్నపేట: వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో పట్టభద్రులంతా కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు ఓటు వేసి గెలిపించాలని కొడకండ్ల, బచ్చన్నపేట కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు ధరావత్ సురేష్‌నాయక్, నూకల బాల్‌రెడ్డి కోరారు. బుధవారం వారు ఆయా మండలాల్లోని రంగాపురం, గోపాల్‌నగర్, చిన్నరామన్‌చర్ల గ్రామాల్లో పట్టభద్రులైన ఓటర్లను స్థానిక నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులు ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నను గెలిపించి శాసన మండలికి పంపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి షేక్ అబ్దుల్లా, పిన్నింటి కావ్యశ్రీతోపాటు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులే

స్టేషన్‌ఘన్‌పూర్: దేశం కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం పోరాటాలు చేసేది కమ్యూనిస్టులేనని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు అన్నారు. మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో బుధవారం సీపీఎం మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి మునిగెల రమేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ప్రస్తుతం దేశంలో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలతో సమాజం మొత్తం కార్పొరేట్ చేతుల్లోకి వెళ్తుందని, తద్వారా ధనికులు మరింత ధనికులుగా, పేదలు మరింత పేదలుగా మారుతారన్నారు. సమాజంలో ఉన్న దోపిడిని అరికట్టాలంటే కమ్యూనిస్టులు బలపడాలని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేసే కమ్యూనిస్టులను అన్ని వర్గాల ప్రజలు ఆదరించాలని ఆయన కోరారు. సీపీఎం సభ్యుల చైతన్యం కోసం, ప్రజా సమస్యల పరిష్కారానికి భవిష్యత్ కార్యాచరణ నిమిత్తం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 31 నుంచి జూన్ 1వరకు ఘన్‌పూర్‌లో జిల్లాస్థాయి రాజకీయ శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణా తరగతులకు సీపీఎం శ్రేణులు సకాలంలో హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. మల్లారెడ్డి, రాములమ్మ, ఉప్పలయ్య, పరమేష్, యాకయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాపర్తి రాజు

మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండి

చిల్పూరు: ఎమ్మెల్సీ ఎన్నికలో పట్టభద్రులు బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పార్టీ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ నలగం శ్రీనివాస్, పార్టీ రాష్ట్ర నాయకుడు బొజ్జపల్లి సుభాష్ కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో వారు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్‌యాదవ్, నాయకులు సంపత్, పెండ్యాల దిలీప్, రజనీకర్, తోట శ్రీనివాస్, ఊరడి రాజు, సాదం భీమన్న, పిట్టల రమేష్, అనీల్, మారబోయిన రమేష్, జోగులు, బాల్నె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలు మార్చే వారిని పక్కకు పెట్టండి

బచ్చన్నపేట: ప్రజల మన్ననలతో గెలిచిన నాయకులు తమ ఇష్టానుసారం పార్టీల కండువాలను మార్చుతున్నారని, అలాంటి వారిని పక్కకు పెట్టాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ బళ్ల శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో, అలాగే పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలో పార్టీ బలపర్చిన అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని పట్టభద్రులను అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిమ్ముల నరేందర్‌రెడ్డి, నాయకులు సద్ది సోమిరెడ్డి, దొంతుల చెంద్రమౌళి, జూకంటి గణేష్, మహేష్ పాల్గొన్నారు.

అక్రమ కేసులు, నోటీసులు సరికాదు

దేవరుప్పుల : దేవునిగుట్టకు విఘాతం కల్పించే క్వారీ పనులు చేపట్టడంపై ప్రజాస్వామ్యయుతంగా అభ్యంతరం వ్యక్తం చేసిన తమపై అక్రమ కేసులతోపాటు అకారణంగా హైకోర్టు ద్వారా నోటీసులు జారీ చేయడం సరికాదని కడవెండికి చెందిన పలువురు వాపోయారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దేవునిగుట్ట క్వారీ కాంట్రాక్టర్లు హైకోర్టు ద్వారా జారీ చేసిన నోటీసుల ప్రతులను చూపించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ కడవెండి గ్రామ శాఖ అధ్యక్షుడు తాటిపెల్లి మహేష్ మాట్లాడుతూ మా గ్రామ శివారులోని లక్ష్మీనర్సింహస్వామి (దేవునిగుట్ట) గుట్ట జాతర ధర్మాపురం, మాధాపురం రెవెన్యూ గ్రామాల మధ్య జరుగుతుంది. దేవునిగుట్టపై క్వారీ తవ్వకాల కోసం గత ప్రభుత్వం అనుమతులు ఇస్తే ఇక్కడి ప్రజల ప్రయోజనాలకు భంగం కలుకుంతుందని స్వయాన అప్పటి కేబినేట్ మంత్రి హోదా కలిగిన ఎర్రబెల్లి దయాకర్‌రావు క్వారీ రద్దు చేయాలని ప్రభుత్వానికి లేఖ రాశారని గుర్తు చేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దు చేయిస్తామన్న హామీ పక్కకుపోగా.. తమతోపాటు మాజీ మంత్రి దయాకర్‌రావు తదితరులకు నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. సుడిగెల హన్మంతు, ఎరువ రఫేల్‌రెడ్డి, దుబ్బాక రత్నాకర్‌రెడ్డి, పెద్ది రవీందర్, సత్యనారాయణ, కాశబోయిన నగేష్, వెంకన్న, సోమన్న పాల్గొన్నారు.



నోటీసులు చూపిస్తున్న కడవెండి గ్రామస్తులు

నివాళి

జనగామ రూరల్: షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం కలెక్టరేట్‌లో దళిత వైతాళికుడు మాదరి భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ సంక్షేమాధికారి కె.దయానంద రాణి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ టి.వేదమని, సిబ్బంది పాల్గొన్నారు.